సాక్షి
నిజామాబాద్

ఆదివారం । 4 । మే । 2025



ఇదేమి చోద్యం..

మెండోరా మండలం సావెల్ పీఏసీఎస్‌లో రూ.97 లక్షల అవినీతి జరిగినట్లు ఉన్నతాధికారులు విచారణలో తేల్చారు.

- IIలో ▸



సిద్ధుల గుట్టపై చిరుత?

ఆరు రోజుల క్రితం ఆర్మూర్ పట్టణంలోని నవనాథ సిద్ధులగుట్టపై చిరుత సంచారం కలకలం రేపింది.

- IIలో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
43.9 /24.1

ఉదయంనుంచే ఎండ తీవ్రత పెరుగుతుంది. వాతావరణంలో తేమ శాతం తగ్గుతుంది. ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఉత్తీర్ణులయ్యేందుకు కృషి చేయాలి



ఆర్మూర్‌టౌన్: ఇంటర్ ఫలితాల్లో ఫెయిల్ అయిన విద్యార్థులు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యేలా కృషిచేయాలని రాష్ట్ర ఇంటర్ బోర్డు ప్రత్యేకాధికారి ఒడ్డెన్న అధ్యాపకులకు సూచించారు. ఆర్మూర్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రత్యేక తరగతుల నిర్వహణను ఆయన శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన అధ్యాపకులతో సమావేశమై ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. ఒకటి, రెండు సబ్జెక్టుల్లో ఫెయిల్ అయిన విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి, విద్యార్థులు ఇంటి వద్ద కూడా చదివేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్ , అకడమిక్ సెల్ ఆర్గనైజర్ నర్సయ్య, కళాశాల ప్రిన్సిపాల్ విజయానంద్‌రెడ్డి, అధ్యాపకులు రవి, విజయలక్ష్మి, చంద్రశేఖర్, నరేశ్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

మేకల సంతకు స్థల పరిశీలన



నిజామాబాద్ సిటీ: జిల్లా కేంద్రంలోని అహ్మదీబజార్‌లో నిర్మించిన సమీకృత మార్కెట్ యార్డును అందుబాటులోకి తెచ్చేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. మార్కెట్ నిర్మించిన స్థలం తమదంటూ మిర్యాల్‌కర్ కుటుంబ సభ్యులు కోర్టుకెళ్లిన విషయం తెలిసిందే. దీంతో నుడా చైర్మన్ కేశ వేణు సమస్య పరిష్కారం కోసం మిర్యాల్‌కర్ ఫ్యామిలీతో మాట్లాడారు. తమకు రెండెకరాల స్థలం కేటాయిస్తే అందులో మేకల మండి నిర్వహించుకుంటామని, కోర్టు కేసు వాపస్ తీసుకుంటామని వారు తెలిపారు. దీంతో శనివారం నుడా చైర్మన్ కేశ వేణు, రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో కలిసి నగర శివార్లలోని ప్రభుత్వ స్థలాలను పరిశీలించారు. నాగారంలోని రామర్తి చెరువు, సారంగపూర్‌లోని హనుమాన్ ఆలయ పరిసరాలు, అర్సపల్లిలోని స్థలాలను పరిశీలించి, అందులో ఒక స్థలాన్ని మేకల మండికోసం కేటాయించాలని కలెక్టర్‌కు తెలుపనున్నట్లు కేశ వేణు పేర్కొన్నారు. సమస్య పరిష్కారమైతే 101 గదులున్న సమీకృత మార్కెట్‌ను మాంసం, చేపలు, కూరగాయల దుకాణాలకు ఇవ్వనున్నట్లు తెలిపారు.

6.46 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ

- రైతుల ఖాతాల్లో రూ.1084.24 కోట్లు జమ



శ్రీకాంత్‌రెడ్డి, డీఎం

సుభాష్‌నగర్: జిల్లాలో యాసంగి సీజన్‌కు సంబంధించి 588 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 71,256 మంది రైతుల నుంచి 6,46,490 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించినట్లు పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అందులో 50,608 మెట్రిక్ టన్నుల ధాన్యం దొడ్డు రకం కాగా, 5,95,881 మెట్రిక్ టన్నుల ధాన్యం సన్న రకం సేకరించినట్లు పేర్కొన్నారు. ఇప్పటికే 54,249 మంది రైతులకు ధాన్యం డబ్బులు రూ.1084.24 కోట్లు వారి ఖాతాల్లో జమ చేశామని తెలిపారు. బోనస్ డబ్బులు కూడా జమ చేస్తామన్నారు. కొనుగోలు ప్రక్రియలో ఇబ్బందులు తలెత్తకుండా అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ పర్యవేక్షణలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి అరవింద్‌రెడ్డితో సమన్వయం చేసుకుంటున్నామని డీఎం శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

తాగుతూ.. తూలుతూ..

జిల్లా కేంద్రంలోని కొన్ని ప్రాంతాల్లో 'బహిరంగ మద్యపానం' విచ్చల విడిగా సాగుతోంది. మద్యం ప్రియులు వైన్ షాపుల పక్కన, షాపుల ముందే కూర్చుండి మద్యం సేవిస్తున్నారు. ప్రధాన కూడళ్ల వద్ద ఉన్న వైన్ షాపుల ఎదుట వాహనాలను నిలపడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. మత్తులో మందుబాబులు కొందరు రోడ్లపై న్యూసెన్స్ సృష్టిస్తున్నారు. మరికొందరు రోడ్లపైనే స్పృహ లేకుండా పడిపోతున్నారు. దీంతో రోడ్డు వెంట వెళ్లే వాహనదారులు, పాదచారులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శనివారం 'సాక్షి' నిర్వహించిన ఫోకస్‌లో ఈ దృశ్యాలు కనిపించాయి.



రోడ్డు పక్కన బహిరంగంగా మద్యం సేవిస్తున్న వ్యక్తులు



మద్యం మత్తులో రోడ్డుపై పడిపోయిన వ్యక్తి

- నగరంలో మందు బాబుల న్యూసెన్స్
- అడ్డూ అదుపులేని బహిరంగ మద్యపాన సేవనం
- వైన్ షాపులు, రోడ్ల పక్కనే సిట్టింగ్‌లు
- రోడ్లపైనే వాహనాల నిలిపివేత..
- రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న జనాలు

సాక్షి ఫోకస్

ఖలీల్‌వాడి : నిజామాబాద్ నగరంలోని కొన్ని చోట్ల మందుబాబుల గొడవ ఎక్కువైంది. వైన్ షాపుల ఎదుటే రోడ్ల పక్కన బహిరంగంగా మద్యం సేవిస్తున్నారు. రోడ్లపై వాహనాలను నిలిపి వేయడం, ఆ పక్కనే కూర్చుని మద్యం సేవించడంతో వాహనాదారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే తగు చర్యలు తీసుకుంటామని పోలీస్‌శాఖ ప్రకటిస్తున్నా ఎక్కడ ఎలాంటి చర్యలు చేపట్టిన దాఖలాలు కనిపించడం లేదు. ఈ సందర్భంగా పోలీసులు, వైన్స్ నిర్వాహకులతో మిలాఖత్ అయ్యారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొంత మంది యువకులు వాహనాలపైనే చీకటిగా ఉండే ప్రాంతాలను ఎంచుకుని బహిరంగ మద్యపానం చేస్తున్నారు.

పర్మిట్‌రూమ్‌లలో విచ్చల విడిగా అమ్మకాలు..

జిల్లా కేంద్రంలో 19 వైన్ షాపులు ఉండగా కొన్నింటికి పర్మిట్ రూమ్‌లు ఉన్నాయి. వైన్స్‌లకు పర్మిట్ రూమ్‌లను అబ్కారీశాఖ కేటాయిస్తుంది. వీటికి రెండేళ్ల వరకు అనుమతి ఇస్తుంది. ఇందుకు నిర్వాహకులు వైన్స్ లైసెన్స్ ఫీజుతో పాటు పర్మిట్‌రూమ్‌కు సంబంధించిన రుసుము చెల్లించి, కావాల్సిన మ్యాప్‌ను అబ్కారీశాఖకు అందజేయాల్సి ఉంటుంది. నిబంధనల మేరకు పర్మిట్ రూమ్‌లలో నిలబడే మద్యం సేవించి వెళ్లిపోవాలి. సిట్టింగ్‌కు అనుమతి లేదు. అయితే అలా కాకుండా దాదాపుగా నగరంలోని అన్ని పర్మిట్ రూమ్‌లలో టేబుళ్లు, కుర్చీలు, కూలర్లు, ఫ్యాన్‌లు ఏర్పాటు చేసి సిట్టింగ్ నిర్వహిస్తున్నారు. బార్‌ల మాదిరిగా చికెన్, మటన్, ఫిష్ ఇతర ఆహారపదార్థాలను అందుబాటులో ఉంచుతూ వ్యాపారం నిర్వహిస్తున్నారు.

మద్యం మత్తులో..

కొన్ని చోట్ల వైన్ షాపుల వద్దే మందుబాబులు సిట్టింగ్ పెడుతున్నారు. మితిమీరి తాగి అక్కడే పడిపోతున్నారు. మరికొందరు రోడ్డెక్కి హంగామా సృష్టిస్తున్నారు. జనం రద్దీగా ఉండే ప్రాంతాల్లోని వైన్ షాపుల వద్ద ఇది పెద్ద న్యూసెన్స్‌గా మారుతోంది. మందు బాబులు తాగిన మత్తులో రోడ్లపై స్పృహ లేకుండా తూలుతూ తిరగడంతో వాహనాలతో ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఉన్నాయి. కొంత మంది రోడ్లపైనే పడిపోవడంతో తీవ్రగాయాల పాలవుతున్నారు.

పర్మిట్ రూమ్‌లలో..



ఆర్మూర్ రోడ్‌లో ఓ వైన్స్ పక్కన రోడ్డుపైనే నిలిపిన వాహనాలు

పలువైన్ షాపుల వద్ద రోడ్లపైనే వాహనాలు నిలపడం, పర్మిట్ రూమ్‌ల నుంచి తూలుతూ వచ్చే వారితో రోడ్డు వెంబడి వెళ్లే మహిళలు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రోడ్లపైనే వైన్ షాపులు ఉండటంతో సమస్య తీవ్రంగా ఉంటోంది. మద్యం మత్తులో కొందరు రోడ్లపైనే గొడవలకు దిగడంతో రోడ్డు వెంట వెళ్లే వారు భయపడాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి.

నేడే నీట్ పరీక్ష

- జిల్లాలో 8 కేంద్రాలు
- హాజరుకానున్న 3,398 మంది అభ్యర్థులు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



నిజామాబాద్‌అర్బన్: జిల్లాలో ఆదివారం నీట్ (యూజీ) ప్రవేశ పరీక్ష జరగనుంది. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించే ఈ పరీక్షకు అధికారులు జిల్లా వ్యాప్తంగా 8 కేంద్రాలను ఏర్పాటు చేశారు. నీట్‌కు జిల్లాలో 3,398 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు మాత్రమే అభ్యర్థులను పరీక్ష కేంద్రంలోనికి అనుమతిస్తారన్నారు. నిర్ణీత సమయంలోగా అభ్యర్థులు చేరుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని, పోలీసు బందోబస్తు ఉంటుందని తెలిపారు. హాల్‌లోనికి వెళ్లే ముందు బయోమెట్రిక్ హాజరు, రిజిస్ట్రేషన్, తనిఖీ వంటి ప్రక్రియలు చేపట్టాల్సి ఉన్నందున అభ్యర్థులు ముందస్తుగానే చేరుకోవాల్సి ఉంటుందన్నారు. అభ్యర్థులు తప్పనిసరిగా అడ్మిట్ కార్డు పైన ఒక పాస్‌పోర్టు సైజ్ ఫొటో, మరొక పోస్ట్‌కార్డు సైజు ఫొటోను అతికించాలని, అదనంగా మరొక ఫొటో, ఐడీ ప్రూఫ్‌ను తెచ్చుకోవాలని సూచించారు. దివ్యాంగ అభ్యర్థులు వైకల్యాన్ని ధ్రువీకరించే సర్టిఫికెట్లను తీసుకురావాల్సి ఉంటుందన్నారు. అభ్యర్థుల సందేహాల నివృత్తి కోసం ఐడీవోసీలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ 9912192692, 9885975254 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

పరీక్షా కేంద్రాలివే..

జిల్లా కేంద్రంలో గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, గోల్ హనుమాన్ సమీపంలోని కస్బాగల్లీ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, నాగారంలోని మైనారిటీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల/కళాశాలలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. బోధన్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, డిచ్‌పల్లిలోని తెలంగాణ యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల బిల్డింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ కళాశాల బిల్డింగ్‌లలో కేంద్రాలను ఏర్పాటు చేశారు.

20న సివిల్ సప్లై కార్పొరేషన్ కార్మికుల సమ్మె

- డీఎంకు సమ్మె నోటీసు అందజేత



డీఎం శ్రీకాంత్‌రెడ్డికి సమ్మె నోటీసు అందజేస్తున్న నాయకులు, కార్మికులు

సుభాష్‌నగర్: ఏఐటీయూసీ, ఇతర కేంద్ర కార్మిక సంఘాల జాతీయ సార్వత్రిక సమ్మెలో భాగంగా సివిల్ సప్లై కార్పొరేషన్ కార్మికులు ఈ నెల 20న ఒకరోజు సమ్మె నిర్వహించనున్నట్లు సివిల్ సప్లై కార్పొరేషన్ హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వై ఓమయ్య పేర్కొన్నారు. ఈ మేరకు నగరంలోని సివిల్ సప్లై కార్పొరేషన్ డీఎం శ్రీకాంత్‌రెడ్డికి ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సమ్మె నోటీసు అందజేశారు. అనంతరం ఓమయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికులకు గుండెకాయ లాంటి 29 చట్టాలను రద్దు చేసి నాలుగు కోడ్‌లను తీసుకొచ్చిందని, వాటిని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సివిల్ సప్లై కార్పొరేషన్ కార్మికులను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. దేశవ్యాప్తంగా నిర్వహించే సమ్మెలో కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింగ్‌రావు, కార్యదర్శి పిన్నెల హన్మాండ్లు, సివిల్ సప్లై కార్పొరేషన్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎస్ దేవేందర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

966 ఏళ్ల చరిత్ర..

- బాల్కొండలో కొలువుదీరిన నిమిషాంబదేవి ఆలయం
- దేశం మొత్తంలో ఇలాంటివి 23 ఆలయాలు



నిమిషాంబ దేవి అమ్మవారు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: జిల్లాలోని బాల్కొండలో కొలువైన శ్రీ నిమిషాంబ దేవి ఆలయం పురాతన చరిత్రకు సాక్షిగా నిలుస్తోంది. నిమిషాంబ దేవి ఆలయాలు దేశ వ్యాప్తంగా 23 చోట్ల ఉండగా, బాల్కొండలోనిది 4వ ఆలయంగా ప్రసిద్ధి చెందింది. బాల్కొండ అసలు పేరు అల్లకొండ. కాలక్రమంలో ఇది బాల్కొండగా మారింది. కాకతీయుల కాలంలో అల్లయ్య, కొండయ్య అనే మల్లయోధుల కారణంగా ఈ పేరు వచ్చింది. ఈ అల్లయ్య, మల్లయ్యల కాలం నుంచి అనగా 1059 డిసెంబర్ 19 నుంచి ఈ నిమిషాంబ దేవి క్షేత్రంలో పూజలు జరిగాయి. అనంతర కాలంలో 1502 నుంచి శ్రీ సోమక్షత్రియ (నకాష్) కుల గురువుల ద్వారా నిత్య నైవేద్య పూజలు అందుకుంటోంది. శ్రీ నిమిషాంబ దేవి అదృష్ట సంఖ్య 'మూడు', దీంతో ఇక్కడి అమ్మవారిని దర్శించుకుంటే అడగకుండానే మూడు కోరికలు తీరుస్తుందని భక్తుల నమ్మకం. బ్రహ్మాండ పురాణం ప్రకారం విశ్వామిత్ర మహర్షి ఆధ్వర్యంలో లోకకల్యాణం కోసం 'పుండరిక' యజ్ఞాన్ని ప్రారంభించారు. అమ్మవారి దర్శనం కాకపోవడంతో ముక్త మహర్షి తన శిరస్సును ఖండించుకునే ప్రయత్నం చేయగా ఆ ఆదిపరాశక్తి క్షణకాలంలోనే ప్రత్యక్షమైందని చరిత్ర చెబుతుంది. నిమిషాంబ దేవికి దేశంలో 23 ఆలయాలు ఉండగా మొదటి ఆలయం మధ్యప్రదేశ్‌లోని బిలాస్‌పూర్ వద్ద అమరకంటక్ గ్రామంలో ఉంది. రెండో ఆలయం కర్ణాటకలోని గంజాం వద్ద కావేరి నది ఒడ్డున ఉంది. మూడో ఆలయం ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్ వద్ద తుంగభద్ర నది ఒడ్డున ఉంది. నాలుగో ఆలయం బాల్కొండలో ఉండడం గమనార్హం. బాల్కొండ ఆలయంలో పూర్వం నుంచే పంచలోహ విగ్రహానికి పూజలు చేస్తుండడం విశేషం.

- బాల్కొండలో శ్రీ నిమిషాంబ దేవి ఆలయ పునఃప్రతిష్ఠను 2003 డిసెంబరులో చేశారు. ఈ సందర్భంలో ఇక్కడ అమ్మవారి విగ్రహంతో పాటు వినాయకుడు, శివలింగం, నంది విగ్రహాలు ప్రతిష్ఠించారు. ఈ ఆలయం తొమ్మిది కొండల మధ్య భాగంలో దక్షిణం వైపు ఎన నల్లరాతి కొండకు ఆనుకుని ఉంది. 2018 నుంచి ఈ ఆలయానికి రాష్ట్ర ప్రభుత్వం ధూపదీప నైవేద్య పథకం ద్వారా నిధులు అందిస్తోందని ఆలయ సేవకుడు బీఆర్ నర్సింగ్‌రావు తెలిపారు. తెలంగాణలో అత్యంత ప్రాశస్త్యం కలిగిన ఆలయమని ఆయన పేర్కొన్నారు. నాడు బాల్కొండను పరిపాలించిన కాకతీయ చక్రవర్తి గణపతిదేవుడి హయాంలో రాతి ధ్వజస్తంభం ఏర్పాటు చేసి, దీనికి నలువైపులా దీపాలు వెలిగించుకొనేలా మలిచారు.

అమ్మో.. ఆ సీటా..!

- సబ్ రిజిస్ట్రార్లుగా వచ్చేందుకు జంకుతున్న అధికారులు
- ఇన్‌చార్జులతోనే కొనసాగుతున్న అర్బన్ కార్యాలయం
- నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్లు!



మోపాల్(నిజామాబాద్‌రూరల్): నిజామాబాద్ అర్బన్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్లుగా విధులు నిర్వర్తించాలంటే జంకుతున్నారు. అమ్మో.. ఆ సీటు మాకొద్దంటూ వెనుకడుగు వేస్తున్నారు. గతేడాది నవంబర్ నెలలో బదిలీపై ఇద్దరు రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్లు వచ్చారు. అందులో ఒకరు మార్చి మొదటివారంలో జరిగిన ఏసీబీ దాడుల్లో పట్టుబడగా, మరొకరు దీర్ఘకాలిక సెలవుల్లో ఉన్నారు. దీంతో రెండు నెలలుగా ఇన్‌చార్జులతోనే నెట్టుకొస్తున్నారు. ఇదే అదనుగా ఓ ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్లు చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

అధికారుల్లో వణుకు..

ఏసీబీ దాడులు, డాక్యుమెంట్ రైటర్ల వ్యవహార శైలికి భయపడిన సబ్ రిజిస్ట్రార్-1 కిరణ్ కూడా దీర్ఘకాలిక సెలవులో వెళ్లిపోయారు. రెండు నెలలుగా ఈ కార్యాలయానికి రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్లు బదిలీపై రావాలంటే వణికిపోతున్నారు. బలవంతంగా బదిలీ చేస్తే సెలవుపై వెళ్తామని కొందరు, సస్పెండ్ చేసినా సరే వెళ్లేది లేదని మరికొందరు కరాఖండిగా చెబుతున్నారు. కాగా, ప్రస్తుతం హుస్నాబాద్ నుంచి సబ్ రిజిస్ట్రార్ జబ్బార్, సీనియర్ అసిస్టెంట్ రవికాంత్ ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్లుగా కొనసాగుతున్నారు.

బదిలీలకు ముందు ఒక లెక్క.. తర్వాత మరో లెక్క..

గతంలో నిజామాబాద్ అర్బన్ కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్లుగా చేసేందుకు పోటీ పడేవారు. నిత్యం వందల సంఖ్యలో డాక్యుమెంట్లు.. అదేస్థాయిలో ఆదాయం సమకూరేది. కానీ బదిలీ ప్రక్రియ తర్వాత కార్యాలయం అంతా గందరగోళంగా మారింది. గతేడాది అక్టోబర్‌లో జరిగిన రాష్ట్ర వ్యాప్త బదిలీల్లో భాగంగా నిజామాబాద్ అర్బన్ సబ్ రిజిస్ట్రార్లుగా కిరణ్, శ్రీరామరాజు వచ్చారు. వారు నిబంధనల పేరుతో ఇబ్బందులకు గురి చేస్తున్నారని, డబ్బులు ఎక్కువగా డిమాండ్ చేస్తున్నారంటూ డాక్యుమెంట్ రైటర్లు కార్యాలయాలను బంద్ చేసి నిరసన తెలిపారు. వివాదం సద్దుమణిగిందనుకునే క్రమంలోనే సబ్ రిజిస్ట్రార్-2 శ్రీరామరాజు రెడ్‌హ్యాండెడ్‌గా ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు.



“ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం..

నిజామాబాద్ అర్బన్ కార్యాలయానికి సబ్ రిజిస్ట్రార్లుగా బదిలీపై వచ్చేందుకు భయపడుతున్నారు. రెండు నెలలుగా ఇన్‌చార్జులతోనే నెట్టుకొస్తున్నాం. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. హుస్నాబాద్ నుంచి జబ్బార్ బదిలీపై వచ్చారు. మరొక సీనియర్ అసిస్టెంట్‌ను ఇన్‌చార్జిగా కొనసాగిస్తున్నాం. రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్లు వచ్చే వరకు వారే కొనసాగుతారు. – ప్రసూన, జిల్లా రిజిస్ట్రార్

వెల్‌నెస్ సెంటర్‌ను ఆధునీకరిస్తాం

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు
- సదుపాయాలు కల్పించాలని అధికారులకు ఆదేశం



వెల్‌నెస్ సెంటర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

నిజామాబాద్ నాగారం: ప్రభుత్వ ఉద్యోగులు, టీచర్లు, రిటైర్డు ఉద్యోగులు, జర్నలిస్టుల కోసం ఏర్పాటు చేసిన వెల్‌నెస్ సెంటర్‌లో అన్ని రకాల సదుపాయాలు, సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని నగర పాలక సంస్థ పాత భవనంలో కొనసాగుతున్న వెల్‌నెస్ సెంటర్‌ను శనివారం ఆయన సందర్శించారు. నుడా చైర్మన్ కేశ వేణు, నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్‌తో కలిసి వెల్‌నెస్ సెంటర్‌లో సౌకర్యాలను పరిశీలించారు. ఆరోగ్య పరీక్షలు, చికిత్స కోసం వచ్చే రిటైర్డ్ ఉద్యోగులకు తగు సదుపాయాలు అందుబాటులో ఉండేలా తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రధానంగా వెయిటింగ్ హాల్‌తోపాటు స్త్రీ, పురుషులకు వేర్వేరుగా టాయిలెట్స్, ఔషధాలను పంపిణీ చేసే గదులను అందుబాటులోకి తేవాలన్నారు. అవసరమైన నిధులను మంజూరు చేస్తామని తెలిపారు. అనంతరం రిటైర్డ్ ఉద్యోగుల సంఘ భవనాన్ని కలెక్టర్ సందర్శించారు. సమావేశ మందిరం, పార్కింగ్ కోసం స్థలం కేటాయించాలని సంఘ ప్రతినిధులు కోరగా, కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. కలెక్టర్ వెంట నిజామాబాద్ ఇన్‌చార్జి ఆర్డీవో స్రవంతి, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు రవీందర్ రావు, భూమాగౌడ్, రామ్ మోహన్‌రావు తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలు వేగవంతం చేయాలి

బాల్కొండ: ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని డీఆర్‌డీపీ సాయాగౌడ్‌ అన్నారు. బాల్కొండ మండల పరిధిలోని పలు గ్రామాల్లో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలను శనివారం ఆయన పరిశీలించారు. అనంతరం బాల్కొండ మండల పరిషత్‌ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఇందిరమ్మ నిర్మాణాలను వెంటనే పూర్తి చేసేల చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. అర్హులైన లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో విజయ్‌భాస్కర్‌రెడ్డి, ఎంపీవో గంగామోహన్‌, అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య

- ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌ అలీ



రాష్ట్ర ఉత్తమ ర్యాంకర్‌ అంచితను సన్మానిస్తున్న షబ్బీర్‌ అలీ

కామారెడ్డి టౌన్‌: ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని, ప్రభుత్వ ఉద్యోగులు సైతం తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌ అలీ అన్నారు. శనివారం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన జిల్లా విద్యార్థులను సన్మానించి వారికి ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ నాయకులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కుల పంపిణీ



చెక్కులను అందజేస్తున్న షబ్బీర్‌ అలీ

కామారెడ్డి టౌన్‌: పట్టణంలో ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో నియోజకవర్గ పరిధిలో పలువురు లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కులను ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌ అలీ శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కైలాస్‌ శ్రీనివాసరావు, కాంగ్రెస్‌ నాయకులు పాల్గొన్నారు.

వన్యప్రాణుల దాహార్తిని తీర్చేందుకు చర్యలు



ట్యాంకర్‌ ద్వారా నీటిని నింపుతున్న దృశ్యం

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): వన్యప్రాణుల దాహార్తిని తీర్చేందుకు నాగిరెడ్డిపేట ఫారెస్ట్‌రేంజ్‌ అధికారులు తగుచర్యలు చేపడుతున్నారు. దీనిలో భాగంగా రేంజ్‌పరిధిలోని ధర్మారెడ్డి బీట్‌ ఏరియా అటవీప్రాంతంలో ఉన్న సాసర్‌ పిట్‌లలో ఫారెస్ట్‌ అధికారులు నీటిని నింపారు. గ్రామపంచాయతీ ట్యాంకర్‌ ద్వారా అటవీ ప్రాంతంలోని సాసర్‌పిట్‌లలో నీటిని నింపి వన్యప్రాణుల దాహార్తిని తీరుస్తున్నారు.

రైలు ఢీకొని 10 గేదెలు మృతి

నవీపేట: మండలంలోని అభంగపట్నం శివారులో శనివారం సాయంత్రం రైలు ఢీకొని అదే గ్రామానికి చెందిన పది గేదెలు మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. మేతకు వెళ్లిన పశువుల మంద తిరుగు ప్రయాణంలో రైలు పట్టాల పైనుంచి దాటుతుండగా బాసర నుంచి నిజామాబాద్‌ వైపు వెళ్తున్న గూడ్స్‌ రైలు వాటిని ఢీకొట్టింది. ఈఘటనలో 10 గేదెలు మృతి చెందగా ఒకటి మాత్రమే తీవ్ర గాయాలతో బతికిందని గ్రామస్తులు తెలిపారు.

రేపటి నుంచి 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు'

రుద్రూర్‌: ఈ నెల 5వ తేదీ నుంచి వచ్చే నెల 13 వరకు జిల్లాలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్‌ టీ అంజయ్య తెలిపారు. వ్యవసాయ పరిశోధన కేంద్రం, కేవీకే, వ్యవసాయ సాంకేతిక కళాశాలలోని శాస్త్రవేత్తలు, అధ్యాపకులు ఆయా మండలాల్లోని రైతు వేదికల్లో అన్నదాతలకు అవగాహన కల్పిస్తారన్నారు.

అలాగే సాగు వ్యయం తగ్గించడం, నేల సంరక్షణ, సాగునీటి ఆదా, పంట మార్పిడి, పర్యావరణ పరిరక్షణ, సుస్థిర ఆదాయం పొందడం తదితర అంశాలతోపాటు రైతుల సందేహాలను నివృత్తి చేస్తారని వారు తెలిపారు. ఆయా గ్రామాల్లో నిర్వహించే కార్యక్రమాలకు రైతులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

తేదీ	మండలం	రైతు వేదిక	తేదీ	మండలం	రైతు వేదిక	తేదీ	మండలం	రైతు వేదిక
5	ముప్కాల్	రెంజర్ల	19	బోధన్	మినార్‌పల్లి	జూన్ 2	ఎడపల్లి	బ్రాహ్మణపల్లి
	పొతంగల్	పొతంగల్	20	వర్ని	ఫైడిమల్	3	మెండోరా	వెలగటూర్
6	భీమ్‌గల్	ముచ్కూర్			హమ్మపూర్		వేల్పూర్	మోతె
	మోపాల్	సిర్పూర్	21	డిచ్‌పల్లి	డిచ్‌పల్లి	4	ధర్పల్లి	హొన్నాజీపేట
8	కోటగిరి	కోటగిరి	22	ఎడపల్లి	పోచారం		చందూర్	కారేగాం
	ముప్కాల్	కొత్తపల్లి	23	నవీపేట్	నవీపేట్	5	ఏర్గట్ల	ఏర్గట్ల
9	ఇందల్వాయి	ఎల్లారెడ్డిపల్లి	24	నిజామాబాద్	గుండారం	6	రుద్రూర్	రాయకూర్
	జక్రాన్‌పల్లి	జక్రాన్‌పల్లి		చందూర్	చందూర్		ఎడపల్లి	మంగళ్‌పహాడ్
12	బాల్కొండ	వన్నెల్(బి)	26	జక్రాన్‌పల్లి	కలిగోట్	9	మోస్రా	తిమ్మాపూర్
13	భీమ్‌గల్	చేంగల్		సాలూరా	హున్సా		ఆలూర్	ఆలూర్
	కమ్మర్‌పల్లి	కమ్మర్‌పల్లి	27	వేల్పూర్	అంక్సాపూర్	10	డొంకేశ్వర్	డొంకేశ్వర్
14	బాల్కొండ	బాల్కొండ	28	చందూర్	ఘనపూర్		సాలూరా	సాలూరా
15	మాక్లూర్	మాక్లూర్	29	పొతంగల్	కల్లూర్	11	నందిపేట	సిద్ధాపూర్
16	కోటగిరి	ఎత్తొండ	30	రెంజల్	రెంజల్	12	జక్రాన్‌పల్లి	మునిపల్లి
17	మెండోరా	మెండోరా	31	మోపాల్	అమ్రాబాద్	13	రుద్రూర్	బొప్పాపూర్
	బోధన్	పెగడాపల్లి		వర్ని	జాకోరా		ధర్పల్లి	దుబ్బాక

ఆగిన బీఎస్‌ఎన్‌ఎల్‌ సేవలు

- గంటపాటు తీవ్ర ఇబ్బందులు పడ్డ వినియోగదారులు
- లైన్లను పునరుద్ధరించిన అధికారులు



నిజామాబాద్‌ రూరల్‌: బీఎస్‌ఎన్‌ఎల్‌ (భారతీయ సంచార్‌ నిగం లిమిటెడ్‌) సేవలకు శనివారం సాయంత్రం దాదాపు గంటపాటు అంతరాయం కలిగింది. దీంతో బీఎస్‌ఎన్‌ఎల్‌ వినియోగదారులు నెట్‌వర్క్‌ లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నిజామాబాద్‌ జిల్లాతోపాటు ఆదిలాబాద్‌ జిల్లాలో అటు ఫోన్లు కలవక, ఇటు నెట్‌లేక ఫోన్‌పే, గూగుల్‌పే పనిచేయక నానా ఇక్కట్లు పడ్డారు.

జిల్లా కేంద్రంలో ఉన్న బీఎస్‌ఎన్‌ఎల్‌ ఆఫీస్‌ నుంచి సిగ్నల్స్‌ రావడం లేదని గుర్తించిన వినియోగదారులు అధికారులను వివరణ కోరగా గంట రెండు గంటల్లో లైన్లను పునరుద్ధరిస్తామని తెలిపారు. తిరిగి గంట సేపటికి సిగ్నల్స్‌ అందించారు. ముఖ్యంగా కరీంనగర్‌ జిల్లాలో బీఎస్‌ఎన్‌ఎల్‌ లైన్‌ డ్యామేజ్‌ వల్ల ఈ సమస్య ఏర్పడినట్లు అధికారులు తెలిపారు.

అంతరాయం లేకుండా సేవలు అందించాలి

జిల్లా కేంద్రంలో బీఎస్‌ఎన్‌ఎల్‌ సేవలు సాయంకాలం గంటపాటు ఆగిపోయాయి. ఫోన్‌ కాల్స్‌ రాక, గూగుల్‌ పే, ఫోన్‌ పే పనిచేయక తీవ్ర ఇబ్బందులు పడ్డాం. ఆన్‌లైన్‌ ట్రాన్షక్షన్స్‌ నిలిచి పోవడంతో వ్యాపారులు అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సేవల్లో అంతరాయం కలుగకుండ తగిన చర్యలు చేపట్టాలి.

–గోపి, బీఎస్‌ఎన్‌ఎల్‌ వినియోగదారుడు, నిజామాబాద్‌

40 నిమిషాలు ఆగాయి..


నిజామాబాద్‌ జిల్లాతోపాటు ఆదిలాబాద్‌ జిల్లాలో దాదాపు 40 నిమిషాలు బీఎస్‌ఎన్‌ఎల్‌ మొబైల్‌ సేవలకు అంతరాయం కలిగింది. కరీంనగర్‌ జిల్లా లైనింగ్‌ సమస్య వల్ల రెండు జిల్లాల్లో సేవలు ఆగిపోయాయి. మా సిబ్బంది వెంటనే స్పందించి లైన్లను పునరుద్ధరించడంతో వినియోగదారులకు మళ్లీ సేవలు అందుబాటులోకి వచ్చాయి.

–మారుతి, అసిస్టెంట్‌ జనరల్‌ మేనేజర్‌, బీఎస్‌ఎన్‌ఎల్‌ నిజామాబాద్‌

సిద్ధులగుట్టపై చిరుత ఉందా? లేదా?



వైరల్‌ అవుతున్న వీడియోలోని చిరుత పులి దృశ్యం



సిద్ధుల గుట్టపై చిరుతపులి కనిపించిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఫారెస్ట్‌ అధికారులు(ఫైల్‌)

- ఆరు రోజులు గడిచినా సీసీ కెమెరాకు చిక్కని చిరుత పులి కదలికలు
- మరో వీడియో వైరల్‌ కావడంతో భయాందోళనలో ఆర్మూర్‌ ప్రజలు

ఆర్మూర్‌టౌన్‌: ఆరురోజుల క్రితం ఆర్మూర్‌ పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్టపై చిరుత సంచారం కలకలం రేపింది. కాగా చిరుత నక్కిన గుహ ప్రాంతంలో, నీటి వనరులు ఉన్న ప్రాంతంలో దాని కదలికలను గుర్తించడానికి అటవీశాఖ అధికారులు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నారు. కానీ ఇప్పటి వరకు సీసీ కెమెరాలో చిరుత కదలికలు నిక్షిప్తం కాలేదు. ఇతర పశువులు, కోతులు సంచరిస్తున్నట్లు సీసీ కెమెరాలో అధికారులు గుర్తించారు. ఆరు రోజులు గడుస్తున్న చిరుత జాడ తెలియడం లేదు. భక్తులు చూస్తుండగా గుహలోకి వెళ్లిన చిరుత ఇప్పటి వరకు బయటకు రాలేదు. ఆరు రోజులైన ఆహారం కోసం, దప్పిక తీర్చుకోవాడానికి చిరుత బయటకు వస్తలేదంటే ఇక్కడ ఉన్నట్లా? లేదా మరో ప్రాంతానికి వెళ్లిపోయిందా అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఇదిలా ఉండగా ఇతర ప్రాంతంలో అటవీశాఖ అధికారులు చిరుతను పట్టుకున్నప్పుడు తీసిన వీడియో ఆర్మూర్‌ పట్టణంలో వైరల్‌ అవుతుండంతో ప్రజలు భయభ్రాంతులకు గురువుతున్నారు. దీంతో సిద్ధుల గుట్టపై ఎక్కాలంటే భయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చిరుత సంచారంపై పక్కా సమాచారం తెలపాలని, చిరుతపులి ఉంటే పట్టుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఆందోళనకు గురికావద్దు..



ఆర్మూర్‌ పట్టణంలో వైరల్‌ అవుతున్న చిరుత ఫేక్‌ వీడియోతో ప్రజలు ఆందోళనకు గురికావద్దు. చిరుతను పట్టుకోవడానికి ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో ఇప్పటి వరకు ఎటువంటి ఆనవాళ్లు కనిపించలేదు. అలాగే చిరుత అడుగులు సైతం కనబడలేదు. ప్రజలు భయపడవద్దు.

–శ్రీనివాస్‌, ఫారెస్ట్‌ రెంజ్‌ అధికారి, ఆర్మూర్‌

ఇదేమి చోద్యం..

- సొవెల్‌ సహకార సంఘంలో రూ.97లక్షల అవినీతి
- ఎవరి వాటా ఎంతో తేల్చి నోటీసులు జారీ చేసిన అధికారులు
- సేల్స్‌మన్‌ ఒక్కరే రూ.60లక్షలు దుర్వినియోగం చేశాడంటూ నోటీస్‌

బాల్కొండ: మెండోరా మండలం సొవెల్‌ ప్రాథమిక సహకర సంఘంలో 97 లక్షల అవినీతి జరిగిందని ఉన్నత అధికారులు విచారణలో తేల్చారు. కానీ ఎవరి వాట ఎంత అనే దానిపై అధికారులు ఇచ్చిన నోటీసలు చూస్తే ఇదేం చోద్యం అంటూ పలువురు పేర్కొంటున్నారు. ఎవరి నిర్లక్ష్యం వల్ల జరిగిందో చెప్పకుండా అధికారులు నోటీసలు జారీ చేయడంపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. సహకార సంఘంలో ఎరువులను విక్రయించే సేల్స్‌మన్‌ రూ.59లక్షల 79వేల 585లు దుర్వినియోగం చేసినట్లు నోటీస్‌ జారీ చేశారు. కేవలం ఎరువుల క్రయ, విక్రయాలు చేసే వ్యక్తి ఇంత పెద్ద మొత్తంలో దుర్వినియోగం చేస్తే పాలక వర్గం ఎందుకు మిన్నకున్నది అనేది సమాధానం లేని ప్రశ్నగా మిగిలింది. అలాగే సహకార సంఘంలో కార్యదర్శిగా విధులు నిర్వర్తించిన అధికారి 24లక్షల 2వేల 543రూపాయాలు దుర్వినియోగం చేసినట్లు పేర్కొన్నారు. ఇద్దరివి కలిపి సుమారుగా 84లక్షల రూపాయలు వాడుకున్నట్లు పేర్కొన్నారు. పాలకవర్గంలో సభ్యులు 74వేల218 రూపాయాలు దుర్వినియోగం చేసినట్లు నోటీస్‌లు ఇచ్చారు. ఈక్రమంలో పాలకవర్గంలోని కొందరు సేల్స్‌మన్‌ను వాడుకుని నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్లు ఆరోపణలు జోరుగావినవస్తున్నాయి.

సీల్డ్‌కవర్‌లో నివేదిక..

ప్రస్తుతం నోటీసులు అందించింది విచారణ అధికారి ఇచ్చిన సమాచారం మేరకు ఇచ్చినట్లు తెలిసింది. మహజన సభ నిర్వహించిన రోజు సీల్డ్‌ కవర్‌లో మరొక నివేదిక అందించే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు. మహజన సభ తేదీని ఖరారు చేయుటకు శనివారం పాలకవర్గం సమావేశమైనట్లు తెలిసింది. ఉన్నతాధికారులు స్పందించి అవినీతికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్‌ చేస్తున్నారు. అధికారులు జారీ చేసిన నోటీస్‌లను సంబంధించిన వారికి అందించినట్లు ఇన్‌చార్జి సీఈవో మహేశ్‌ తెలిపారు. అధికారులు పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి ఎవరి వాట ఎంత అనే లెక్కలను తేల్చాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

క్రైం కార్నర్‌

ట్రాక్టర్‌ బోల్తాపడి రైతు మృతి



ట్రాక్టర్‌ కింద రాజు మృత దేహం

బాల్కొండ: మండలంలోని బోదేపల్లి గ్రామ శివారులో నవాబు లిఫ్ట కాలువలో ప్రమాదవశాత్తు ట్రాక్టర్‌ బోల్తాపడి అదే గ్రామానికి చెందిన గొరుమెంత రాజు(38) రైతు అక్కడిక్కడే మృతి చెందాడు. వివరాలు ఇలా.. రాజు వ్యవసాయంతోపాటు గొర్రెలను మేపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో గొర్రెలకు మేత తీసుకరావడానికి తన స్నేహితుడు నరేష్‌కు చెందిన ట్రాక్టర్‌ను తీసుకొని వెళ్లాడు. గ్రామ శివారులోని కాలువలో ప్రమాదవశాత్తు ట్రాక్టర్‌ బోల్తాపడింది. దీంతో రాజుకు తీవ్ర గాయాలై అక్కడిక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని ఆర్మూర్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

బోధన్‌లో గుర్తు తెలియని వ్యక్తి..

బోధన్‌టౌన్‌(బోధన్‌): పట్టణంలోని రాకాసీపేట్‌ రైల్వే స్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. స్టేషన్‌ ఆవరణలో మృతదేహాన్ని గుర్తించిన రైల్వే సిబ్బంది నిజామాబాద్‌ రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న రైల్వే పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నిజామాబాద్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి వయస్సు 25–30 ఏళ్ల మధ్య ఉంటుందని, తాపీ మేస్త్రీ పని చేసుకుంటున్నట్లు అనుమానం వ్యక్తం చేశారు. మృతుడికి సంబంధించిన వ్యక్తులు ఎవరైన ఉంటే రైల్వే పోలీసులను సంప్రదించాలని సూచించారు.

మాదాపూర్‌లో గుడిసె దగ్ధం



మాక్లూర్‌: మండలంలోని మాదాపూర్‌లో కేడం రమేష్‌కు చెందిన పూరి గుడిసె ఎండ తీవ్రతకు దగ్ధం అయినట్టు మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌ మహ్మద్‌ షఫీ శనివారం తెలిపారు. శనివారం మధ్యాహ్నం కుటుంబీకులు ఇంట్లో నిద్రిస్తుండగానే అకస్మాత్తుగా మంటలు లేసి గుడిసె దగ్ధం అయినట్టు బాధితులు తెలిపారన్నారు. గుడిసెలో ఉన్న వంట సామగ్రి, దుస్తులు కాలి బూడిదైనట్టు తెలిపారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన సమాచారం మేరకు పంచనామా నిర్వహించగా అరతులం పుస్తెల తాడు, అరతులం వెండి పట్ట గొలుసులు గుడిసెలోనే దగ్ధం అయినట్టు తెలిపారు.

వేర్వేరు కారణాలతో పలువురి ఆత్మహత్య

బిచ్కుంద(జుక్కల్‌): మండలంలోని కందర్‌పల్లి గ్రామంలో ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడినట్లు సీఐ నరేష్‌ శనివారం తెలిపారు. వివరాలు ఇలా.. కందర్‌పల్లికి చెందిన రేణుకకు ఇద్దరు మగ పిల్లలు, ఒక పాప పుట్టగా అనారోగ్యంతో మగ పిల్లలు మృతిచెందారు. ఈవిషయమై దంపతుల మధ్య తరచు గొడవలు జరిగేవి. భర్త వేధింపులు, గొడవలు భరించక రేణుక గురువారం అర్ధరాత్రి ఇంటిలోని దులానికి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

సంఘమేశ్వర్‌లో రైతు..

దోమకొండ: మండలంలోని సంఘమేశ్వర్‌ గ్రామంలో ఓ యువ రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన పంతులుగారి పెంటయ్య(26)కు గ్రామ శివారులో రెండు ఎకరాల వ్యవసాయభూమి ఉంది. దీంట్లో ఎకరం పొలం వేయగా, మిగతా బీడుభూమిగా ఉంది. వ్యవసాయ సాగుకోసం వీటిలో గత ఆరు నెలల నుంచి ఇప్పటి వరకు పది బోర్లు వేశాడు. కానీ నీళ్లు పడకపోగా అప్పుల పాలయ్యాడు. పది బోర్లకు దాదాపుగా రూ. 8లక్షల వరకు అప్పు అయింది. దీంతో జీవితంపై విరక్తి చెంది శనివారం తెల్లవారుజామున ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి బాలయ్య గతంలో మరణించగా, తల్లి మణెవ్వ, సోదరుడు శేఖర్‌తో కలిసి ఉంటున్నాడు. వ్యవసాయ పనులకు తోడు ట్రాక్టర్‌ పనులు చేస్తూ ఇంటికి అండగా ఉన్నాడు. పెంటయ్య మృతితో ఆ కుటుంబం జీవనాధారం కోల్పోయినట్లయింది. తల్లి మణెవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై స్రవంతి తెలిపారు.

పెద్దమల్లారెడ్డిలో యువకుడు..



ప్రవీణ్‌ మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

భిక్కనూరు: మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామంలో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడినట్లు భిక్కనూరు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన మర్రి ప్రవీణ్‌ (24) కూలీ పని చేస్తూ తాగుడుకు బానిసయ్యాడు. తరచు మద్యం తాగేందుకు ఇంట్లో వారిని డబ్బులు అడిగేవాడు. శుక్రవారం రాత్రి ప్రవీణ్‌ మద్యం తాగేందుకు తండ్రిని డబ్బు అడుగగా ఆయన ఇవ్వకపోవడంతో తీవ్రమనస్తాపం చెందాడు. ఈక్రమంలో ఇంట్లోని బెడ్‌రూమ్‌లోకి వెళ్లి ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకున్నాడు. కుటుంబసభ్యులు గమనించి, వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి పోలీసులు చేరుకొని, వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకొని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై వివరించారు.

గోలిలింగాలలో ఒకరు..



పిట్ల నర్సింలు(ఫైల్‌)

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని గోలిలింగాలలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు ఇలా.. గోలిలింగాల గ్రామానికి చెందిన గ్రామానికి చెందిన పిట్ల నర్సింలు(30) తన చెల్లెలు భవానిని నాలుగేళ్ల క్రితం మెదక్‌ జిల్లా హవేలీ ఘణపూర్‌ గ్రామానికి చెందిన దయానంద్‌కు ఇచ్చి వివాహం జరిపించారు. కాగా కట్నం కింద ఏడున్నర తులాల బంగారం ఇస్తామని ఒప్పుకోగా ఐదున్నర తులాలు ఇచ్చారు. మరో రెండు తులాల బంగారం కోసం అత్తింటివారు ఆమెను వేధించేవారు. ఈక్రమంలో చెల్లికి ఇవ్వాల్సిన బంగారం ఇవ్వలేకపోవడంతోపాటు ఇతర అప్పులు తీర్చలేక నర్సింలు తీవ్రఆవేదనకు గురయ్యాడు. ఈ క్రమంలో తన చెల్లిని అత్తింటివారు వేధిస్తున్నారని పేర్కొంటూ నర్సింలు సూసైడ్‌నోట్‌ రాసి శుక్రవారం ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మల్లారెడ్డి తెలిపారు.

రాజరాజేశ్వరీనగర్‌లో వివాహిత..

కమ్మర్‌పల్లి: మండలంలోని రాజరాజేశ్వరీనగర్‌లో ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. కమ్మర్‌పల్లి ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా.. రాజరాజేశ్వరీనగర్‌ గ్రామానికి చెందిన బోదాసు లక్ష్మి(50) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఎన్ని ఆస్పత్రులకు వెళ్లినా, ఆరోగ్యం కుదుటపడక పోవడంతో మనస్తాపం చెందింది. ఈక్రమంలో శనివారం ఇంట్లో సీలింగ్‌ ఫ్యానుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి కొడుకు బోదాసు గంగాధర్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

సొంతూరికి చేరిన గల్ఫ్‌ బాధితుడు

- ఏజెంట్ల చేతిలో మోసపోయి, మలేషియాలో ఏడాదిగా నరకయాతన
- నాయకుల చొరవతో క్షేమంగా ఇంటికి..



మలేషియా నుంచి ఇంటికి చేరిన బాధితుడు లింగారెడ్డితో గల్ఫ్‌ కార్మిక సంఘం నాయకుడు చాంద్‌పాషా

మోర్తాడ్‌(బాల్కొండ): ఏజెంట్ల చేతిలో మోసపోయి, ఏడాది కాలంగా మలేషియాలో నరకయాతన అనుభవించిన ఏర్గట్ల వాసి ఒకరు నాయకుల చొరవతో క్షేమంగా ఇంటికి చేరుకున్నాడు. వివరాలు ఇలా.. ఏర్గట్లకు చెందిన లింగారెడ్డి ఉపాధి కోసం కువైట్‌ వెళ్లడానికి జగిత్యాల్‌ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం కోమటి కొండాపూర్‌కు చెందిన ఏజెంట్‌ను ఆశ్రయించాడు. కువైట్‌ కంటే మలేషియాలో మంచి పనులు ఉన్నాయని నమ్మించిన ఏజెంట్‌ అతడి వద్ద రూ.90వేలు వసూలు చేశాడు. వారం రోజుల విజిట్‌ వీసాను లింగారెడ్డి చేతిలో పెట్టి మలేషియా వెళ్లిన తరువాత వర్క్‌ వీసాను తమ ఏజెంట్లు ఇప్పిస్తారని అతడిని నమ్మించాడు. తీరా మలేషియా వెళ్లిన తరువాత అక్కడ ఉన్న బ్రోకర్లు లింగారెడ్డి వద్ద నుంచి మరో రూ.50వేలు వసూలు చేసి, చేతులెత్తేశారు. దీంతో పని కోసం వెతుకుతున్న తరుణంలో బస్సు ప్రమాదానికి గురైన అతడి కాలు విరిగింది. విజిట్‌ వీసా గడువు ముగిసిపోవడంతో అతను చట్టవిరుద్ధంగా ఉండాల్సి వచ్చింది. ఇక్కడి గల్ఫ్‌ కార్మిక సంఘం నాయకుడు చాంద్‌పాషా, కాంగ్రెస్‌ నాయకులు శివన్నోల్ల శివకుమార్‌, శివన్నోల్ల రాజులు స్పందించి లింగారెడ్డికి విదేశాంగ శాఖ ద్వారా సహకారం అందించారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవడంతో లింగారెడ్డి విషయంలో మలేషియాలో ఉన్న మన రాయబార కార్యాలయం అధికారులు సానుకూలత వ్యక్తం చేశారు. లింగారెడ్డి చేతిలో నయా పైసా లేకపోవడంతో అతను మలేషియా నుంచి ఇంటికి చేరుకోవడానికి అవసరమైన విమాన టిక్కెట్‌ను నియోజకవర్గ కాంగ్రెస్‌ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డి కొనుగోలు చేసి ఇచ్చారు. దీంతో బాధితుడు రెండు రోజుల క్రితం ఇంటికి చేరుకున్నాడు. ఏజెంట్లు మోసం చేసినా మానవతా ధ్రుక్పథంతో తనను ఇంటికి చేర్పించిన నాయకులకు లింగారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

పోలీసులమని చెప్పి బంగారం చోరీ

డిచ్‌పల్లి: పోలీసుల పేరు చెప్పి మాయమాటలతో వృద్ధుడిని మోసం చేసి అతడి వద్ద ఉన్న తులంన్నర బంగారాన్ని ఎత్తుకెళ్లిన ఘటన మండలంలో కలకలం రేపింది. డిచ్‌పల్లి ఎస్సై ఎండీ షరీఫ్‌ తెలిపిన వివరాలు ఇలా.. ఇందల్వాయి మండలం రూప్లానాయక్‌ తండాకు చెందిన ఇత్యానాయక్‌ శుక్రవారం తన మనవడితో కలిసి బైక్‌పై నిజామాబాద్‌ జిల్లా కేంద్రంలో బంధువుల ఇంట్లో జరిగే శుభకార్యానికి బయలుదేరాడు. డిచ్‌పల్లి మండలం మాధవనగర్‌ బైపాస్‌ రోడ్డు వద్దకు రాగానే వెనక నుంచి బైక్‌పై వచ్చిన ఇద్దరు యువకులు అతడి బైక్‌ను అడ్డుకుని నిలిపివేయించారు. తాము పోలీసులమని, కొద్దిసేపటి క్రితం కంఠేశ్వర్‌ వద్ద బంగారం చోరీ జరిగిందని, అక్కడ పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నారని తెలిపారు. నీ మెడలో ఉన్న బంగారు గొలుసు (తులం), చేతి వేలికి ఉన్న బంగారు ఉంగరం (అరతులం) తీసి కవర్‌లో పెట్టుకోవాలని వృద్ధుడికి సూచించారు. దీంతో ఇత్యానాయక్‌ వారి చేతికి బంగారు గొలుసు, ఉంగరం ఇచ్చాడు. వారు తమ వద్ద ఉన్న కవర్‌లో గొలుసు, ఉంగరాన్ని ఉంచి కర్చీఫ్‌తో ముడివేసి ఇత్యానాయక్‌కు ఇచ్చారు. అనంతరం ఇత్యానాయక్‌ అక్కడి నుంచి బయలుదేరి, ఇంటికి చేరుకున్నాడు. కొద్దిసేపటికి కవర్‌లో చూడగా అందులో డూప్లికేట్‌ గొలుసు, ఉంగరం ఉండటం గమనించి ఆందోళనకు గురయ్యాడు. వెంటనే కుటుంబీకులకు తెలియజేయగా వారు డిచ్‌పల్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. బాధితుడి ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై షరీఫ్‌ తెలిపారు. ఎవరైనా మాయమాటలు చెబితే నమ్మవద్దని పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్సై సూచించారు.

ఆరేళ్ల బాలికపై వృద్ధుడి అత్యాచారం!

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని ఒక గ్రామంలో ఆరేళ్ల బాలికపై 65ఏళ్ల వృద్ధుడు అత్యాచారం చేసిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. విశ్వసనీయ సమాచారం మేరకు వివరాలు ఇలా.. మూడు రోజుల క్రితం వృద్ధుడు బాలికకు మాయమాటలు చెప్పి తన ఇంట్లోకి తీసుకెళ్లి అత్యాచారం చేసినట్లు తెలిసింది. శుక్రవారం బాలిక కుటుంబసభ్యులకు విషయం తెలియడంతో వారు పోలీసులను ఆశ్రయించారు. దీంతో నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి శనివారం రిమాండ్‌కు తరలించినట్లు తెలిసింది.